క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పీ హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానూరు గ్రామంలోని పెద్దబావి సెంటర్, తోటలు, రంగాబొమ్మ సెంటర్, వృద్ధుల ఆశ్రమం ప్రాంతం, కెనడీ స్కూల్, రాజీక మల్‌బిల్డింగ్, కామయ్యతోపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తాడిగడప–పోరంకిలో..

పెనమలూరు: తాడిగడప సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిగడప గ్రామం, శ్రీనివాసానగర్ కట్ట, పద్మజానగర్, లిమ్రాకాలనీ, కార్మికనగర్ కట్ట, ఎస్‌టీబీఎల్ కాలనీ, పెదపులిపాక తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే పోరంకి గ్రామంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

యూపీహెచ్‌సీ పరిశీలన



పెనమలూరు: యనమలకుదురులో అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి(డీపీఎంవో) డాక్టర్ గీతాపద్మా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు యూపీహెచ్‌సీలోని సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. మందులు చాలినన్ని అందుబాటులో లేకపోవడంతో సమస్య తలెత్తుతోందని తెలిపారు. మందులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. అలాగే పిల్లలకు వాక్సినేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తే పేదలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుతామని సూచించారు. యూపీహెచ్‌సీకి ఓపీ అధికంగా ఉంటున్నందున ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ దాతలు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

గన్నవరం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీపీటీడీ ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో స్థానిక డిపో ఎదుట శుక్రవారం వరుసగా రెండవ రోజు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం డిపో అధ్యక్షుడు శ్రీనివాసరావు, గ్యారేజ్ కార్యదర్శి ఆంజనేయులు, సంఘ నేతలు ఉషారాణి, నాని, బాబ్జీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెనమలూరు: గ్యాస్‌లీక్ అయ్యి మంటల్లో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్ర యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన పోలేపల్లి రాము(25) కానూరు మహదేవపురంకాలనీ సూర్యెన్‌క్లేవ్ అపార్టుమెంట్ సమీపంలో ఈ నెల ఒకటవ తేదీన గ్యాస్ పైప్‌లైన్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్‌లీక్ అయ్యి మంటలు రావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 10వ తేదీ రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి లింగస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మురుగు నిరోధానికి చర్యలు

కంకిపాడు: ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్ పరిసరాల్లో మురుగు నిరోధానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వీ భావనారాయణ స్పష్టంచేశారు. గాయత్రీ విహార్ పరిసరాల్లో తహసీల్దార్ శుక్రవారం పర్యటించారు. గాయత్రీ విహార్‌తోపాటు పరిసరాల్లోని నివాసితులు వాడే మురుగుతో ఖాళీస్థలాలు, పంట పొలాలు నిండిపోతున్నాయన్నారు. కాలనీ నుంచి వచ్చే మురుగును నియంత్రించుకోవాలని, మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఆర్ఐ ఉస్మాన్, సర్వేయర్ భాస్కర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల విజృంభణ





ప్రసాదంపాడులోని ఖాళీస్థలంలో మురుగునీరు

- అధ్వానంగా పారిశుద్ధ్యం
- దోమలకు నివాసాలుగా ఖాళీస్థలాలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా దాడి చేస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలకు కంటి మీద కునుకు కరువు అవుతోంది. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల ప్రజలను దోమల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్యం సమస్య పరిష్కారానికి నోచుకోని సమస్యగా మారడమే దీనికి ప్రధాన కారణం. ఈ గ్రామాలన్నీ విజయవాడ నగరానికి ఆనుకుని ఉన్నప్పటికీ దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదు.

ఖాళీ స్థలాల్లో చేరుతున్న మురుగునీరు

పారుదలకు నోచుకోని డ్రెయిన్లు, చెత్త కుప్పలతోపాటు ఆయా గ్రామాల్లోని ఖాళీ స్థలాలు నరకాన్ని తలపిస్తున్నాయి. ఈ ఖాళీ స్థలాల్లో సమీప అపార్టుమెంట్లు, నివాసాల్లో వాడిన మురుగు వచ్చి చేరుతుంది. దీనికి తోడు ఖాళీస్థలాల్లో ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగి దోమలు, విషసర్పాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఆయా పంచాయతీలు ఈ ఖాళీ స్థలాల సమస్య పరిష్కరించకపోవడంతో అవి దారుణంగా మారుతున్నాయి. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వాటిని శుభ్రం చేయించి మెరక తోలించుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నివారణ చర్యలు శూన్యం

నిత్యం దోమలతో యుద్ధం చేస్తున్న కూడా సంబంధిత పంచాయతీ అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో పారుదల లేని డ్రెయిన్లలో పూడిక తీసి చెత్త కుప్పలను తొలగించేవారని గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పారిశుద్ధ్య పనులు పూర్తి స్థాయిలో నిర్వహించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పూడిక తీయించి దోమల లార్వా వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే దోమలకు ఆవాసాలుగా మారిన ఖాళీ స్థలాల సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

పూడికతీతకు నోచుకోని డ్రెయిన్లు

జాతీయరహదారిని ఆనుకుని ఉన్న ఈ గ్రామాల్లో ప్రధానంగా డ్రెయిన్ల సమస్య పట్టి పీడిస్తోంది. ప్రధాన డ్రెయిన్లతోపాటు అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లు పారుదలకు నోచుకోకపోవడంతో మురుగునీరు నిలిచిపోతుంది. నివాసాల మధ్య ఉండే మురుగు నీరు దోమల విజృంభణకు దారి తీస్తోంది. నిలిచిన మురుగునీరుపై దోమల లార్వా వృద్ధి చెందుతోంది. ఆయా గ్రామాల్లో పారుదలకు నోచుకోని డ్రెయిన్లతోపాటు పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఈ ప్రాంతాల్లోని అంతర్గత రహదారుల్లో చెత్త కుప్పలు ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. ఇటువంటి అపరిశుభ్ర ప్రాంతాల్లో దోమలు మరింతగా వృద్ధి చెందుతున్నాయని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి



పెదపులిపాకలో పూలేకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



ఎనికేపాడులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ పూర్ణ తదితరులు



తాడిగడప జంక్షన్‌లో జ్యోతిరావుపూలేకు నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

పెనమలూరు: సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి మహాత్మ జ్యోతీరావ్ పూలే విశేష కృషి చేశారని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. పెదపులిపాక గ్రామంలో శుక్రవారం బీసీ సెల్ ఆధ్వర్యాన జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే ఆశయ సాధనకు ఉద్యమించాలని కోరారు. బీసీ సెల్ అధ్యక్షుడు మండూరు కోటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు మాదు శ్రీహరిరాణి, నందిపాటి బిందుమాధవి, చండూరు శేఖర్ పాల్గొన్నారు. అలాగే టీడీపీ ఆధ్వర్యాన తాడిగడప జంక్షన్‌లో జరిగిన పూలే జయంతి వేడుకల్లో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు పూలే సేవలను కొనియాడారు. పంచాయతీ కార్యదర్శి విద్యాధరరావు, ఎంపీటీసీలు గంగుల శ్రీనివాసరావు, మాదు సుబ్బారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లో శుక్రవారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేసరపల్లి వార్డు సభ్యురాలు రత్నమాల, ఈద పద్మ, అన్నవరపు జయలక్ష్మి, కునపురెడ్డి రజని పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు అంకం చిట్టిబాబు, సంజీవరావు, నరసయ్య, దుర్గారావు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి



కానూరులో నిరసన ర్యాలీ చేస్తున్న ముస్లింలు



ఎనికేపాడులో ముస్లింల ర్యాలీ

పెనమలూరు: వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలని కోరుతూ కానూరు సనత్‌నగర్‌లో ముస్లింలు శుక్రవారం నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు చంద్రబాబు మద్దతు పలకడం ముస్లింలకు తీవ్ర ఆవేదన మిగిల్చిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్పందించి వక్ఫ్ బిల్లు ఉపసంహరణకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ర్యాలీలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో శుక్రవారం వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేకిస్తూ గ్రామంలోని మస్జిద్-ఏ- మహ్మదీయ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఖాలేషా వలి ఆధ్వర్యంలో మసీదు నుంచి ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మదీయ మసీదు అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ సాహెబ్ వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైస్ ప్రెసిడెంట్ కాలేషా వలి సాహెబ్, సెక్రటరి సయ్యద్ రషీద్ సాహెబ్, మౌలానా ఫరీద్, సయ్యద్ మస్తాన్, షేక్ సుభాని, ఖాదర్ బాషా, జానీ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

మెట్రో రైలు ప్రాజెక్ట్ కోసం స్థల పరిశీలన



కేసరపల్లి వద్ద స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

గన్నవరం: విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు సంబంధించి మండలంలోని కేసరపల్లి, గన్నవరం ప్రాంతాల్లో శుక్రవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. కేసరపల్లి నుంచి గన్నవరం ఆర్టీసీ బస్‌స్టాండ్ వరకు 4.5 కిలోమీటర్ల పొడవునా మెట్రో రైలు ప్రాజెక్ట్ ఏర్పాటుకు మెట్రో ట్రైన్ చీఫ్ ఇంజినీర్ రంగారావు, ఆర్టీఓ బాలసుబ్రహ్మణ్యం పలు శాఖల అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా కేసరపల్లి, హెచ్‌సీఎల్, బుద్ధవరం బస్‌స్టాండ్, గన్నవరం జంక్షన్ల వద్ద నాలుగు స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు రంగారావు తెలిపారు. గన్నవరం బస్‌స్టాండ్‌కు సమీపంలో 60 ఎకరాల్లో మెట్రో రైలు డిపో ఏర్పాటుకు కూడా సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. నాలుగు మెట్రో స్టేషన్ల ఏర్పాటుకు మరో పది ఎకరాలు వరకు భూమి అవసరం అవుతుందన్నారు. మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేసే చోట జాతీయ రహదారి డ్రెయినేజీ నుంచి 12 మీటర్ల లోపలికి భూసేకరణ చేయాల్సి ఉండటంతో సర్వే నిర్వహించిన మార్కింగ్ చేసినట్లు తెలిపారు. తహసీల్దారు కే వెంకటశివయ్య, మండల సర్వేయర్ మాధవరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ బలరాం, విద్యుత్ శాఖ ఏఈ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలకు కృషి

కంకిపాడు: రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో స్థానిక నాయకులు శుక్రవారం ధనయ్యను సత్కరించారు. మినుముకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆయనకు తెలిపారు. ధనయ్య మాట్లాడుతూ రైతు ప్రయోజనాల కోసం కమిటీ పనిచేస్తుందన్నారు. నేతలు కొండవీటి శివయ్య, పీ మధుసూదన్‌రావు, బొబ్బా శ్రీనివాస్, వల్లభనేని రాంబాబు, కంచర్ల శేషగిరి, జోగా ఆదినారాయణ, సోములు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి బీజీఆర్ నగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న జుజ్జువరపు భాగ్యశ్రీకి శుక్రవారం గ్రామ ఉపసర్పంచి జాస్తి శ్రీధర్‌బాబు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న భాగ్యశ్రీకి డయాలసిస్ నిమిత్తం తనవంతు సాయంగా ఆర్థిక తోడ్పాటునందించినట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు శొంఠి కిశోర్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్లు ప్రారంభం

గన్నవరం: స్థానిక పాతగన్నవరం, చెంచులకాలనీ, శ్రీనగర్‌కాలనీ, రాయ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను శుక్రవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక ఆగిరిపల్లి రోడ్డు విస్తరణ కోసం ఆక్రమణలను తొలగించాలని అధికారులకు సూచించారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఉపసర్పంచి పాలడుగు నాని తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు

గన్నవరం: పౌష్టికాహారంతో తల్లి,బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగపద్మావతి పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి పీ విమలమ్మ, ఏఎన్‌ఎం వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్ పేర్సి, ఐ మీనాకుమారి, బీ అరుణ పాల్గొన్నారు.

కంకిపాడు: కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పట్టణంలోని బ్యాంకు కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషణ్ పక్వాడా అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమం ఉద్దేశ్యాన్ని ప్రాజెక్టు సూపర్‌వైజర్ అన్నామణి వివరించారు. కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనమలూరు: కానూరు మహదేవపురం కాలనీలో శుక్రవారం పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. తల్లిబిడ్డలు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ జీ విజయలక్ష్మి సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద ఐసీడీఎస్ ఆధ్వర్యాన శుక్రవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొని పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్‌లు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి



నున్న రైతు సేవా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. నున్న గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి రైతులకు మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం వ్యవసాయశాఖ సహాయకులకు వినతి పత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పీ ప్రసాదరెడ్డి, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కే శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ సభ్యుడు సుబ్రహ్మణ్యంరాజు, రైతులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నివారణకు రూ.5 లక్షలా..?

ఉయ్యూరు పట్టణ పంచాయతీలో తీర్మానం

ఉయ్యూరు రూరల్: ఉయ్యూరు పట్టణంలో వీధి కుక్కల నివారణకు నగర పంచాయతీ నిధుల నుంచి అక్షరాల రూ.5 లక్షలు వెచ్చించడం చర్చనీయాంశమైంది. స్థానిక కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. ప్రతిపక్షం లేకపోవడంతో ఈ తీర్మానాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదం పొందడం జరిగింది. ఇందులో మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు పట్టణంలో వీధి కుక్కల నివారణ చర్యలో భాగంగా వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌తో పాటు, యాంటీ రాబిస్ వ్యాక్సిన్ ఇచ్చేందుకు తెలంగాణకు చెందిన నవోదయ సొసైటీకి కాంట్రాక్ట్ ఇచ్చినట్లు వారికి ఒక్కొక్క కుక్కకు రు.1,500 చెల్లించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 270 కుక్కలకు వ్యాక్సిన్ ఆపరేషన్లు చేసినట్లు అజెండాలో తెలిపారు. అంతేగాక ఇంకా పట్టణంలో మిగిలి ఉన్న వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ చేయుటకు మరో లక్ష రూపాయలు కేటాయించినట్లు అజెండాలో పేర్కొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించిన ఎన్‌క్వాస్ టీమ్



హెల్త్ క్లినిక్‌ను పరిశీలించిన ఎన్‌క్వాస్ టీమ్ సభ్యులు

గన్నవరం: ఉంగుటూరు మండలం ముక్కపాడులోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శుక్రవారం ఎన్‌క్వాస్(నేషనల్ ఎక్యూరెన్స్ క్వాలిటీ కంట్రోల్) బృందం సందర్శించింది. హెల్త్ క్లినిక్‌లో రోగులకు అందిస్తున్న వివిధ రకాల రక్త పరీక్షలు, వైద్య సేవలను ఎంక్వాస్ టీమ్ పరిశీలించింది. అనంతరం టెలికాన్ఫరెన్స్ ద్వారా హెల్త్ క్లినిక్ అందిస్తున్న సేవలను న్యూఢిల్లీలోని హెడ్ క్వార్టర్స్ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంక్వాస్ టీమ్ కోఆర్డినేటర్ డాక్టర్ చైతన్య మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు శాశ్వత భవనాల ఏర్పాటు, సిబ్బంది భర్తీ, మందులు, వైద్య పరికరాలను సమకూర్చేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. టీం సభ్యులు డాక్టర్ సంధ్య, ఉంగుటూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వాణి, హెల్త్ సూపర్‌వైజర్ రాజు, పలువురు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పాప పశ్చాత్తాప పాదయాత్ర

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం నుంచి గుణదల మాత పుణ్యక్షేత్రం వరకు శుక్రవారం దీక్ష చేపట్టిన భక్తులు పాప పశ్చాత్తాప పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా నున్న ఏసు తిరు హృదయ దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో ఫాదర్ జోషి మాట్లాడుతూ పాప పశ్చాత్తాప పాదయాత్రలో ఏసు క్రీస్తు శ్రమలను స్మరించుకొంటూ భక్తులు, సంఘస్తులు పాదయాత్ర చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్ అజ్జు, సెయింట్ ఆన్స్ సిస్టర్స్, ఎంసీ బ్రదర్స్ పాల్గొన్నారు.